సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 13 । ఆగస్టు । 2023



దోశ వేస్తున్న ఈ దంపతులు ఎల్లారెడ్డిపేటకు చెందిన కట్కూరి బాబు–భారతి. బాబు బీటెక్, భారతి డిగ్రీ వరకు చదువుకున్నారు. కరోనా సమయం వరకు బాబు లెక్చరర్‌గా, భారతి స్కూల్‌లో ప్రైవేట్ టీచర్‌గా పని చేసేవారు. కరోనా తెచ్చిన సంక్షోభంతో వీరిద్దరూ ఉద్యోగాలు కోల్పోయారు. అప్పుడే కొత్త ఆలోచనతో మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న అనారోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని మిల్లెట్స్ టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని అనుకున్నారు. మొదట ఎల్లారెడ్డిపేటలోనే మిల్లెట్ హోటల్‌ను ప్రారంభించిన వీరు ప్రస్తుతం సిరిసిల్ల పట్టణంలో రూ.8లక్షల వ్యయంతో వ్యాపారం విస్తరించారు. వీరు ఉపాధి పొందడంతోపాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు.



ఇతను గుగులోత్ నరేశ్. డిగ్రీ వరకు చదువుకున్న నరేశ్ ఉపాధి కోసం మస్కట్ వెళ్లాడు. అక్కడ కలర్స్ ఫ్యాక్టరీలో పనిచేశాడు. అక్కడ గడించిన అనుభవంతో సొంతూరు ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో ఇటీవల అప్పులు చేసి కలర్ ఫ్యాక్టరీ పెట్టాడు. రాజస్థాన్ నుంచి ముడిసరుకులు తెప్పించి కలర్స్ తయారు చేసి ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో వ్యాపారాన్ని విస్తరించాడు. ఒకప్పుడు గల్ఫ్ దేశాలకు కూలిగా వెళ్లిన నరేశ్.. ఇప్పుడు సొంతూరిలోనే రంగుల దుకాణం పెట్టి పది మందికి ఉపాధి కల్పించి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

# అనుభవాలే పాఠాలుగా..

- ఉన్నత చదువులు చదివి స్వయం ఉపాధి వైపు అడుగులు
- కొత్త ఆలోచనలతో సొంత యూనిట్లు
- పలువురికి ఉపాధి
- ఆదర్శంగా నిలుస్తున్న యువ వ్యాపారులు



ఇతను ఎల్లారెడ్డిపేటకు చెందిన రైతు జంకె శ్రీధర్‌రెడ్డి. డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేశారు. మూడెకరాలలో వ్యవసాయ పనులు చేస్తూ అనుబంధ రంగాలైన గొర్రెలు, నాటుకోళ్ల ఫామ్‌ను పెట్టాడు. 2017లో 20 గొర్రెలతో మొదలుపెట్టి షెడ్డులో.. ప్రస్తుతం 50 వరకు గొర్రెలు, నాటుకోళ్లు పెంచుతున్నాడు. వాటి ఎరువును సైతం ఇతర రైతులకు విక్రయిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాడు. సంప్రదాయ వ్యవసాయం చేస్తూ నష్టపోతున్న అన్నదాతలకు అనుబంధ రంగాలలో రాణించవచ్చని శ్రీధర్‌రెడ్డి పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఉన్నత చదువులు చదివారు. ప్రైవేట్ రంగాలలో పనిచేశారు. కాలం నేర్పిన పాఠాలతో సరికొత్త ఆలోచనలతో స్వయం ఉపాధి వైపు అడుగులు వేశారు. ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా తనకు నచ్చిన రంగాలలో రాణిస్తూ..మరి మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ఒకరు కూలీగా గల్ఫ్ దేశాలబాట పట్టగా.. మరో ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగాలు చేయగా.. ఇంకొకరు అరకొర వ్యవసాయం చేయగా.. ఆయా రంగాలలో రాణించలేక.. ఆర్థికంగా నిలదొక్కుకోలేక ఇబ్బందులు పడ్డారు. కాలంలో వస్తున్న మార్పులను అవగతం చేసుకొని సరికొత్త వ్యాపారాలను ప్రారంభించారు. ఒక దంపతులు మిల్లెట్స్ టిఫిన్ సెంటర్ పెట్టగా.. గల్ఫ్‌బాట పట్టిన కూలీ సొంతూరిలోనే కలర్స్ ఫ్యాక్టరీని ప్రారంభించాడు. మరో రైతు వినూత్న ఆలోచనలతో వ్యవసాయ అనుబంధ రంగాలలో రాణిస్తున్నారు. వీరు ఉపాధి పొందడంతోపాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఉద్యోగాలు రాలేవని ఆందోళన చెందుతున్న యువతకు వీరు ఆదర్శంగా నిలుస్తున్నారు. కొత్త ఆలోచనలతో యువత మెదడుకు పదును పెడితే ఆర్థికంగా స్వావలంబన సాధించుకోచ్చనే దానికి ఈ నలుగురు ఉదాహరణగా నిలుస్తున్నారు.

**జిల్లాలో స్వయం ఉపాధివైపు అడుగులు**

బాబు–భారతి దంపతులు మిల్లెట్స్ హోటల్‌ను ప్రారంభించి ఆరోగ్యకరమైన టిఫిన్స్‌ను అందిస్తున్నారు. బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడేవారికి కొత్త కాన్సెప్ట్‌తో మిల్లెట్స్ పూరి, దోశ, ఇడ్లీ, పెసరట్టు, రాగిదోశ, రాగిజావ, జొన్నదోశ, రాగివడ వంటివి అందిస్తున్నారు. అలాగే గుగులోతు నరేశ్ పెయింట్స్ ప్రొడక్ట్స్ తయారీకి నాలుగు రకాల సున్నం బస్తాలు, 15 రకాల కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నాడు. సున్నం బస్తాలను అహ్మదాబాద్, ముంబై, కేరళ, చెన్నై, హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకొని పలు రకాల కలర్స్ ఉత్పత్తులను తయారు చేస్తున్నాడు. శ్రీధర్‌రెడ్డి వ్యవసాయ అనుబంధ రంగాన్ని ఎంచుకొని మేకలు, నాటుకోళ్ల పెంపకంతో నెలకు సుమారు రూ.25వేల ఆదాయం పొందుతున్నాడు. ఉన్న ఊరిలోనే స్వయం ఉపాధితో తలెత్తుకొని బతుకుతున్నాడు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని మరికొందరు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. ఇందుకు నిదర్శనం జిల్లాలో ఇటీవల పెరిగిన టిఫిన్‌సెంటర్లు.. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు..వివిధ వ్యాపారాలు. చిన్నగా మొదలుపెడుతున్న వ్యాపారాన్ని తక్కువ సమయంలోనే వివిధ ప్రాంతాలకు విస్తరిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

# సీపీఎస్ రద్దు చేయాలి

- యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ధర్నా

**సిరిసిల్లటౌన్:** విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, సీపీఎస్‌ను రద్దు చేయాలని యూఎస్‌పీసీ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సిరిసిల్లలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేసిన అనంతరం మాట్లాడారు. 2004కు ముందే ఎంపికై ఆలస్యంగా నియమితులైన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, ఇతర శాఖల ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. కోడ్‌రూల్స్ రూపొందించి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. జూనియర్ లెక్చరర్ల పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లకు 40 శాతం కోటా కేటాయించాలని కోరారు. ఈమేరకు ఆర్డీవో ఆఫీసులో




ధర్నా చేస్తున్న యూఎస్‌పీసీ నేతలు

వినతిపత్రం అందించారు. దోర్నాల భూపాల్‌రెడ్డి, దొంతుల శ్రీహరి, మహేందర్‌రావు, మల్లేశం, రాజేశ్వర్‌రావు, సుధాకర్‌రెడ్డి, మిట్టపల్లి ప్రశాంత్‌కుమార్, రవీందర్, పురుషోత్తం ఉన్నారు.

## పంద్రాగస్టు వేడుకలకు మంత్రి కేటీఆర్



మంత్రి కేటీఆర్

**సిరిసిల్ల:** సిరిసిల్లలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారకరామారావు పాల్గొంటారని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లా కేంద్రాల్లో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనే ప్రజాప్రతినిధుల పేర్లను ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. ఈమేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించే వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.



## రాజన్నా శరణు.. శరణు



**వేములవాడ:** రాజన్నను శనివారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. భక్తుల ద్వారా రాజన్నకు రూ.20 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

## ఫిర్యాదులపై స్పందించాలి

- ఎస్పీ అఖిల్‌మహాజన్



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

**వేములవాడరూరల్:** ప్రజలు వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే జాప్యం చేయకుండా వెంటనే స్పందించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. అన్ని గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ, కార్యాలయం గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు పక్కాగా చేయాలన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ ఎస్సై మారుతి, ట్రాఫిక్ ఎస్సై దిలీప్ ఉన్నారు.

# రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- అమరుల స్తూపం వద్ద వంటావార్పు
- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత

**సిరిసిల్లటౌన్:** ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శనివారం సిరిసిల్ల పాతబస్టాండ్ వద్ద అమరవీరుల స్తూపం వద్ద వంటావార్పు చేపట్టారు. వారు మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేసిన తమని కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కూడా అమలు చేయడం లేదన్నారు. ఈమేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి, వడ్డేపల్లి లక్ష్మణ్, రెండో ఏఎన్‌ఎంలు సువర్ణ, సుమతి, కల్పలత, శ్యామల, మంజుల పాల్గొన్నారు.



రెండో ఏఎన్‌ఎంల వంటావార్పు

## అన్నకు తమ్ముడి కిడ్నీ



**సిరిసిల్ల:** తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన పబ్బతి విజయేందర్‌రెడ్డి(53) రైతు. షటిల్ ఆడేవాడు. ఉన్నట్టుండి వాంతులయ్యాయి. ఆస్పత్రికి వెళ్లగా కిడ్నీలు ఫెయిలయ్యాయని వైద్యులు నిర్ధారించారు. డయాలసిస్‌కు నెలకు రూ.40వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చయ్యాయి. మూడు నెలలు గడిచాయి. విజయేందర్‌రెడ్డిని ఆస్పత్రిలో ఆ స్థితిలో చూసిన అతని తమ్ముడు జితేందర్‌రెడ్డి(50) తన రెండు కిడ్నీల్లో ఒకటి ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. హైదరాబాద్ ఆస్పత్రిలో ఆపరేషన్ అయింది. మృత్యువు ముంగిట అసహాయంగా నిల్చున్న అన్నకు ఆత్మీయ రక్తబంధం పునర్జన్మనిచ్చింది. విజయేందర్‌రెడ్డి ప్రస్తుతం జిల్లెల్లలో వ్యవసాయం, తమ్ముడు జితేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.

## తొలి డోనర్ లక్ష్మి



ఇప్పనపెల్లి లక్ష్మి(ఫైల్)

**సిరిసిల్లకల్చరల్:** సిరిసిల్లలోని గాంధీనగర్‌కు చెందిన ఇప్పనపల్లి నారాయణ, లక్ష్మి దంపతులు. మిర్చి బండి పెట్టుకుని జీవించేవారు. 12 ఏళ్లక్రితం పనులు ముగించుకుని ఇంటికెళ్లారు. అర్ధరాత్రి దాటాక విపరీతమైన తలనొప్పితో లక్ష్మి కింద పడిపోయింది. ఆమెను హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చేర్పించారు. ఆమె బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవదానంపై అవగాహన కల్పించారు. ఆమె కుమారులు సంతోష్, రమేశ్ అంగీకారం మేరకు లక్ష్మి ఊపిరితిత్తులు, కాలేయం, గుండె, మూత్రపిండాలు సేకరించి నలుగురు వ్యక్తులకు అమర్చారు. జిల్లాలోనే తొలి అవయవ దాతగా లక్ష్మి గుర్తింపుపొందారు.

## తండ్రి.. భార్య ఇద్దరూ దాతలే




**కోరుట్ల:** తండ్రి.. భార్య ఇద్దరూ కిడ్నీ దాతలుగా నిలిచారు. కోరుట్లకు చెందిన గీత కార్మికుడు పోతుగంటి శ్రీనివాస్ 2017లో వెన్నునొప్పితో అవస్థ పడడంతో తండ్రి రఘుగౌడ్ వైద్యులతో పరీక్షలు చేయించాడు. శ్రీనివాస్‌కు కిడ్నీ సమస్య ఉందని తేలడంతో కలవరపడ్డాడు. వైద్యులు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయకతప్పదని చెప్పడంతో రఘుగౌడ్ తన కిడ్నీదానం చేశాడు. శ్రీనివాస్ ఆరోగ్యం కుదుటపడింది. ఐదేళ్ల తరువాత 2022లో మళ్లీ వెన్నునొప్పి మొదలైంది. మరోసారి పరీక్షించిన వైద్యులు మళ్లీ కిడ్నీ మార్చిడి చేయాల్సిందేనని చెప్పడంతో అతడి భార్య లావణ్య కిడ్నీ ఇచ్చింది. శ్రీనివాస్ తేరుకుని ప్రస్తుతం ఏ సమస్య లేకుండా తన పనులు తాను చేసుకుంటున్నాడు.

# మరణించి.. జీవించి..

- అవయవదానానికి ముందుకొస్తున్న కుటుంబాలు
- ఉమ్మడి జిల్లా ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- నేడు ప్రపంచ అవయవ దాన దినోత్సవం

“ మనిషికి ఒకటే జన్మ.. అదే మనిషి అవయవాలకు మాత్రం రెండు జన్మలు. అవయవదానం చేస్తే మరణించినా మరోసారి జీవించే అవకాశం ఉంది. ఒక్క మనిషి చనిపోతే గుండె, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం, పేగులు, చేతులు, ముఖం, కణజాలం, ఎముకమజ్జ, మూలకణాలు దానం చేసి మరో 8 మంది ప్రాణాలు కాపాడొచ్చు. దేశంలో మరణాల సంఖ్య అధికంగా ఉన్నా.. అవయవదాతలు ఆ స్థాయిలో ఉండడం లేదు. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువుల ఆలోచనలు, ఆచారాలు, కట్టుబాట్లు, అవగాహన రాహిత్యంతో చాలామంది ముందుకు రావడం లేదు. 18ఏళ్లు దాటినవారు ఆర్గాన్స్ డొనేట్ చేయొచ్చు. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రాణం పోసిన.. దాతల సహకారంతో బతుకుతున్న వారిపై..

ఈ వారం సండే స్పెషల్..



సండే స్పెషల్



## అవయవదాతల‘అబ్బిడిపల్లె’



ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

**ఓదెల:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం అబ్బిడిపల్లె వాసులు మూకుమ్మడిగా అవయవదానానికి అంగీకరిస్తూ తీర్మానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అప్పటి కలెక్టర్ సంగీతకు లేఖ అప్పగించారు. అబ్బిడిపల్లెలో 600 జనాభా ఉంటుంది. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించగా.. సర్పంచ్ ఒజ్జ కోమలత ఆధ్వర్యంలో తీర్మానం చేసి శభాష్ అనిపించుకున్నారు.

## మెడికల్ కాలేజీకి మృతదేహం



మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబసభ్యులు, సదాశయ ప్రతినిధులు(ఫైల్)

**కోల్‌సిటీ:** గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన దేవకి పార్థసారథి (85) తన మరణానంతరం అవయవాలు దానం చేస్తానని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రం రాసిచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న అనారోగ్యంతో మృతి చెందగా.. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను ఐ బ్యాంక్‌కు, పార్థివదేహాన్ని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

## ఏడుగురికి పునర్జన్మ



ఇమానుయేల్(ఫైల్)

**కోల్‌సిటీ:** తాను మరణించి మరో ఏడుగురికి పునర్జన్మిచ్చారు గోదావరిఖనిలోని విద్యానగర్‌కు చెందిన సిరిసిల్ల ఇమానుయేల్(33). హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేసే ఆయన 2019 జనవరి 3న బైక్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వారంపాటు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. ఆయన కుటుంబసభ్యులు ఆయన అవయవాలను దానం చేయగా.. ఏడుగురికి పునర్జన్మ లభించింది.

## నలుగురికి ప్రాణం



**కోల్‌సిటీ:** గోదావరిఖనిలోని ఎల్బీనగర్‌కు చెందిన మింగాని సంపత్(41) ఎమ్మెస్సీ, బీఈడీ చదివారు. ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ డైరెక్టర్. 2019 జనవరి 14న రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లి మరణించారు. నలుగురికి లివర్, రెండు కిడ్నీలు, గుండె అమర్చారు.

## బతికుండగానే..



**సారంగాపూర్:** బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన పొనగంటి స్వప్న(45) అంగన్‌వాడీ టీచర్. తాను చనిపోయాక తన అవయవాలు దానం చేయాలని భర్త నర్సయ్యతో చెబుతుండేది. తీవ్ర జ్వరంబారిన పడి చనిపోయిన ఆమె కోరిక మేరకు ఆమె రెండు కిడ్నీలు, గుండెను దానం చేశారు కుటుంబసభ్యులు.

## దేహదానానికి నిర్ణయం



లింగమూర్తి, విజయ

**కోల్‌సిటీ:** గోదావరిఖని చంద్రబాబుకాలనీలో నివాసం ఉంటున్న మేరుగు లింగమూర్తి ఓసీపీ–3లోని బేస్ వర్క్‌షాప్‌లో ఆపరేటర్. ఎనిదేళ్ల క్రితం రెండు కిడ్నీలు చెడిపోయాయి. డయాలసిస్‌పై ఉన్న భర్త లింగమూర్తిని బతికించుకోవడానికి అతని భార్య విజయ తన కిడ్నీని దానంచేసింది. ఇప్పుడు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. ఇదే స్ఫూర్తితో తమ మరణానంతరం తమ దేహాలను మెడికల్ కాలేజీకి దానం చేస్తామని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రాలు రాసి ఇచ్చారు.

## కొడుకు కళ్లు సజీవం..



**కోల్‌సిటీ:** నా కొడుకు విజయ్‌పాల్‌రెడ్డి 2018 సెప్టెంబర్ 27న చనిపోయాడు. నేను, భార్య సుశీలతోపాటు నా కుటుంబ సభ్యులు దుఃఖంలో కూడా విజయపాల్‌రెడ్డి నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చేశాం. నా భార్య, నేను కూడా మా మరణానంతరం నేత్రదానం చేస్తామని అంగీకారం తెలిపాం. చనిపోయిన వారి అవయవాలు మరికొందరికి ఉపయోగకరంగా ఉంటాయి. వారిలో మనవారిని చూసుకోవచ్చు.

– మారెల్లి రాజిరెడ్డి, యైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని

## తమ్ముడు తోడుండాలని..



**కోరుట్లరూరల్:** మాది మండలంలోని సంగెం. నాకు ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు. చిన్న తమ్ముడు చీటి రాంచందర్‌రావుకు 18ఏళ్ల క్రితం అనారోగ్యంతో రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. డయాలసిస్ చేసినా ప్రయోజనం లేదని డాక్టర్లు చెప్పారు. తమ్ముడిని కాపాడుకునేందుకు ఒక కిడ్నీ ఇచ్చా. కొంతకాలానికి తమ్ముడు అనారోగ్యంతో చనిపోయాడు. కిడ్నీ ఇచ్చిన నేను ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా. అన్ని పనులు చేసుకుంటున్నా. తమ్ముడే దక్కలేదు.

– చీటి మురళీధర్ రావు, సంగెం, కోరుట్ల


## రాష్ట్రం మొదటిస్థానం



**కోల్‌సిటీ:** అవయవదానంపై ప్రజల్లో చైతన్యం వచ్చింది. మన రాష్ట్రం దేశంలో అవయవదానంలో మొదటిస్థానంలో నిలిచింది. గోదావరిఖని ప్రాంతంలో ఎక్కువ మంది ముందుకు వస్తున్నారు. 2008లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పురుడుపోసుకున్న సదాశయ ఫౌండేషన్.. రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అవయవదాతల కుటుంబాలకు, స్వచ్ఛంద సంస్థలకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

– టి.శ్రవణ్‌కుమార్, సదాశయ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు

## మా ఆయన్ను దక్కించుకోవాలని..



**విద్యానగర్(కరీంనగర్):** మా వారు వారాల ఆనంద్. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. 2013లో ఆయనకు రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. వారానికి మూడు సార్లు డయాలసిస్ ఏడాదిపాటు చేయించుకోవాల్సి వచ్చింది. ఆయన్ను దక్కించుకునేందుకు నేను ఒక కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధమయ్యా. నా కిడ్నీని ఆనంద్‌కు 15 జూలై 2014లో ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. నా జీవితంలో ఆయన లేని లోటును ఊహించలేను. నాలో భాగమైన ఒక కిడ్నీ ఇచ్చి బతికించుకున్నాను. ఇప్పుడు నేను, మావారు పిల్లలతో ఆనందంగా ఉన్నాం.

– వారాల ఇందిరారాణి, గృహిణి, కరీంనగర్

## కొడుకు ప్రాణం పోశాడు



**వేములవాడ:** మాది వేములవాడ. కొన్నేళ్లక్రితం లివర్‌వ్యాధి ఉండేది. ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోయింది. నా కొడుకు మారుతి లివర్ నాకు సరిపోయింది. 17 నవంబర్ 2017న మారుతి లివర్‌లోని కొంత భాగాన్ని నా లివర్‌కు జతచేశారు. ఇప్పుడు ఇద్దరం ఆరోగ్యంగా ఉన్నాం. నా కొడుకు లివర్ ఇచ్చి నాకు ప్రాణం పోశాడు.

– కుమ్మరి శంకర్, వేములవాడ

**పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో నేత్ర, అవయవ, దేహదానం వివరాలు**

| | |
|---|---|
| నేత్రదానం | 850 మంది(సుమారు 1,700 మందికి కంటి చూపు వచ్చింది) |
| అవయవదానం | 80 మంది(సుమారు 300 మందికి పైగా పునర్జన్మ) |
| మెడికల్ కళాశాలలకు దేహదానం | 90 మంది |
| అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు | 950 |
| అంగీకారం తెలిపిన వారు | 50వేలకుపైగా.. |

**అవయవదానంపై సేవలందిస్తున్న ప్రతినిధులు**

| | |
|---|---|
| టి.శ్రవణ్‌కుమార్ | 9948609591 |
| సీహెచ్.లింగమూర్తి | 9492781306 |
| మేరుగు భీష్మాచారి | 9849590415 |
| బేణిగోపాల్ త్రివేది | 9848218989 |
| కె.శ్రీనివాస్ | 9849737100 |

## క్లుప్తంగా

### నకిలీ ఉద్యోగ ప్రకటనలు చూసి మోసపోవద్దు


ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లఅర్బన్: సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ఉద్యోగ ప్రకటనలు చూసి మోసపోవద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. సోషల్‌మీడియాలో నకిలీ ఉద్యోగాల పేరుతో వచ్చే లింక్‌లు మోసపూరితమైనవని వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. అధిక లాభాల కోసం ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టవద్దని సూచించారు. ఎవరైనా సైబర్‌మోసాలకు గురైతే టోల్ ఫ్రీ నంబర్లు 1930, డయల్ 100 సంప్రదించాలన్నారు. వ్యక్తిగత సమాచారం సామాజిక మాధ్యమంలో పంచుకోకూడదని సూచించారు. ఇటీవల బోయినపల్లి, సిరిసిల్ల పట్టణంలో జరిగిన సైబర్‌మోసాల గురించి వివరించారు. నకిలీ లాటరీలు, నకిలీ గిఫ్ట్ బాక్సులు, లోన్‌యాప్ తదితర వాటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


మాట్లాడుతున్న తోట ఆగయ్య

గంభీరావుపేట(సిరిసిల్ల): కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, కార్యకర్తలను పార్టీ గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సుభాష్, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

### ముఖరాలో మోహినికుంట వాసులు


ముఖరా పంచాయతీ వద్ద మోహినికుంట వాసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా గ్రామాన్ని మోహినికుంట ప్రజలు శనివారం సందర్శించారు. రాష్ట్రంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు దక్కించుకున్న ముఖరా గ్రామానికి గ్రామస్తులను తీసుకెళ్లినట్లు సర్పంచ్ కల్వకుంట్ల వనజ తెలిపారు. ముఖరాలో ఇంటింటా ఇంకుడు గుంతలు, నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణం, సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించేందుకు పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యలను పరిశీలించడం జరిగిందన్నారు. హరితహారం, శ్మశాన వాటిక, పన్నుల వసూళ్లు తదితర వివరాలను ముఖరా సర్పంచ్ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్ తెలిపారన్నారు. అక్కడి విధానాలు మోహినికుంటలో అమలు కు ప్రయత్నిస్తామన్నారు. రైతుబంధు సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సతీశ్, దేవయ్య, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

# మిగిలింది ఐదురోజులే

- లిక్కర్‌షాపుల టెండర్లకు అనాసక్తి
- గతంతో పోల్చితే భారీగా తగ్గిన దరఖాస్తులు
- వేచిచూసే ధోరణిలో వ్యాపారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మద్యం షాపుల టెండర్ల దరఖాస్తులు మందకొడిగా సాగుతున్నాయి. 2023–25 ఆర్థిక సంవత్సరానికి మద్యం షాపుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ఎక్సైజ్‌శాఖ చేపట్టింది. ఈనెల 18నాటికి వరకు చివరి తేదీ. ఈ సారి రెండు వారాల గడువు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల సంఖ్య తగ్గింది. చాలా మంది మద్యం వ్యాపారులు వేచి చూసే ధోరణిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. దరఖాస్తుల సంఖ్య పెంచేలా ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

**తగ్గిన దరఖాస్తులు..**

ఉమ్మడి జిల్లాలో జగిత్యాలలో 71షాపులకు ఇప్పటి వరకు 210 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ జిల్లాలో 94 షాపులకు గాను 385, పెద్దపల్లిలో 77 షాపులకు 121 దరఖాస్తులు, సిరిసిల్లలో 48షాపులకు గాను 439 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 18వరకు గడువు ఉండటంతో చాలామంది వ్యాపారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. చివరి తేదీనాటికి ఆయా షాపులకు వచ్చిన దరఖాస్తులు, డిమాండ్ ఉన్నషాపులను దృష్టిలో ఉంచుకుని టెండర్‌లో పాల్గొనాలని చూస్తున్నారు. అయితే చివరిరోజు 60 నుంచి 70శాతం దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.


మద్యం షాపుల దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

**డిమాండ్ ఉన్న షాపులపై నజర్**

చాలా మంది మద్యం వ్యాపారులు డిమాండ్ ఉన్న షాపులపై దృష్టి సారించారు. ఇంకో ఐదురోజుల సమయం ఉండటంతో డిమాండ్ ఉన్న షాపుల్లో ఎక్కువ దరఖాస్తులు వేటికి వచ్చాయి, ఏఏ షాపులకు దరఖాస్తు చేయాలనే అంశాలపై దృష్టి పెట్టారు. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్లలో అత్యధికంగా 439 దరఖాస్తులు వచ్చాయి.

**ఉమ్మడి జిల్లాలో మద్యం షాపుల దరఖాస్తులు (శుక్రవారం నాటికి)**

| జిల్లా | దరఖాస్తులు | షాపులు |
|---|---|---|
| జగిత్యాల | 210 | 71 |
| కరీంనగర్ | 385 | 94 |
| పెద్దపల్లి | 121 | 77 |
| సిరిసిల్ల | 439 | 48 |

# డాన్.. డెన్!

- ఇదీ లక్ష్మీరాజం హత్య కేసు నిందితుల తీరు..
- సెటిల్‌మెంట్లకు ప్రత్యేక ఇళ్లు
- అనుచరులంతా పాతికేళ్ల లోపువారే..

కోరుట్ల: ' అంతా సినీ ఫక్కీలోనే 'డాన్..డెన్' సంస్కృతి కొట్టొచ్చినట్లు కనిపించే తీరు.. ఊరికి చివరగా ఉండే రెండు మూడు అంతస్థుల బంగ్లాల అడ్డాలు. ఈ బంగ్లాల్లో కింది అంతస్థులో విత్తనాల నాగరాజుకు సమాచారం.. మద్యం ఇతరత్రా మత్తు పదార్థాలు సరాఫరా చేసే యువకులు.. ఆ పైభాగంలో మరో ఇద్దరు ముగ్గురు యువకులు.. చివరి అంతస్తులో విత్తనాల నాగరాజు. ఇలా పట్టణంలో రెండు మూడు చోట్ల అడ్డాలు వేసిన నాగరాజు తన కార్యకలాపాల కోసం తరచూ అడ్డాలు మార్చేవాడని పోలీసులు విచారణలో తేలింది. ఇంత పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకున్నా నేరానికి పాల్పడిన నిందితులు పోలీసులకు చిక్కకతప్పలేదు.

**అనుచరులు పాతికేళ్లలోపే..**

పోగుల లక్ష్మీరాజం హత్య కేసులో పోలీసులు శుక్రవారం చూపిన నిందితుల్లో ఐదుగురు పాతికేళ్ల లోపు యువకులే. వీరిలో ఒకరికి కేవలం 18 ఏళ్లు మాత్రమే ఉండటం గమనార్హం. గంజాయి, మద్యం మత్తుకు బానిసగా మారిన వీరు అక్రమమార్గంలో డబ్బులు సంపాదించాలన్న ఆశతో సెటిల్‌మెంట్లు, బ్లాక్‌మెయిల్, బెదిరింపులు, డబ్బులు వసూళ్లకు దిగిన సంఘటనలు అనేకమున్నట్లు ప్రచారం. అయిలాపూర్ రోడ్డులో చివరగా ఉండే నాగరాజుకు చెందిన ఓ బంగ్లాలో కోరుట్లలో రైస్‌మిల్ నడిపే ఓ యువకుడిని, అతనికి మద్దతుగా వచ్చిన మరో యువకుడి నగ్న వీడియోలు తీసి చితకబాది మరీ రూ.10 లక్షల వరకు డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఇదే తరహాలో ముత్యాలవాడలో ఓ చిన్నపాటి జ్యోతిష్యుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

**మళ్లీ కస్టడికి..**

పోగుల లక్ష్మీరాజం హత్యకేసులో అరెస్టు అయిన వారిలో కొందరిని పోలీసులు మళ్లీ కస్టడీలోకి తీసుకోనున్నట్లు సమాచారం. లక్ష్మీరాజం హత్య కాకుండా ఇంకా ఏ నేరాల్లో పాలు పంచుకున్నారన్న దానిపై పూర్తిస్థాయి విచారణకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నాగరాజు కేవలం సంచలనం కోసమే హత్య చేశాడని పోలీసులు నిర్ధారించినా బంధువులు, కుటుంబ సభ్యులు మాత్రం ఇంకా ఏమైనా కారణాలతోనేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను మళ్లీ కస్టడీలోకి తీసుకున్న తర్వాత విచారణలో ఎలాంటి విషయాలు తెలుస్తాయోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రాజన్న గుడిపై పటిష్ట నిఘా

వేములవాడ: మరో ఐదు రోజుల్లో శ్రావణమాసం ప్రారంభం కానుండటంతో రాజన్న ఆలయంపై నిఘా పెంచాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సంకల్పించారు. దీంతో రాజేశ్వరపురం నుంచి ఆలయ ఈవో కార్యాలయం వరకు నిత్యం వచ్చే భక్తులు, వీఐపీలు, ఆలయ ఉద్యోగులు, పురప్రముఖుల వాహనాలను పార్కింగ్ వద్దే నిలిపివేయాలని ఆదేశించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈమేరకు శనివారం నుంచి వాహనాల రాకపోకలను సిబ్బంది కట్టుదిట్టం చేశారు. దీంతో ఎవరొచ్చినా పార్కింగ్ వద్దే వాహనాలు నిలిపి కాలినడకన ఈవో కార్యాలయం, ఆలయానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో ఆలయం వద్దకు చేరుకోవడం గగనంగా మారిందని ఆలయ ఉద్యోగులు, పురప్రముఖులు, చర్చించుకుంటున్నారు. ఎస్పీ ఆదేశాలతో ఆలయంలో విధులు నిర్వహించే ఎస్పీఎఫ్, హోంగార్డులు శనివారం ఆలయానికి వచ్చిన వాహనాలను పార్కింగ్ స్థలం వరకే పరిమితం చేశారు. అయితే వీఐపీలు, ఇతర అధికారులు రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన సందర్భంలో ఇక్కడ ఎలాంటి పరిస్థితి నెలకొంటోందో వేచి చూడాలని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఒక్కసారిగా వాహనాలను పార్కింగ్ వద్దే నిలిపివేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# బీసీబంధు లోపాలు సరిదిద్దాలి

- బీసీలందరికీ వర్తింపజేయాలి
- బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్
- సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన

సిరిసిల్లటౌన్: బీసీబంధులోని లోపాలు సరిదిద్దాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలేరు భాస్కర్ కోరారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం నిర్వహించిన నిరసనలో మాట్లాడారు. బీసీల్లో 136 కులాలు ఉంటే 14 కులాలకు మాత్రమే అమలు చేయడం ఏంటని ప్రశ్నించారు. బీసీ కార్పొరేషన్‌లో లక్షలాది మంది దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికి కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. బీసీబంధు ద్వారా రూ.10లక్షల గ్రాంటు ఒక్కొక్కరికి అందజేయాలని కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి అన్నల్‌దాస్ వేణు, నాయకులు సంధ్యారపు వెంకటేశ్, రాష్ట్ర కార్యదర్శి గౌడ వాసు, బర్కం నవీన్‌యాదవ్, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, గుండెల్లి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నిరసన

### మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన జిల్లా గౌడ నాయకులు

సిరిసిల్లఅర్బన్: హైదరాబాద్‌లో గౌడహాస్టల్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, గోపా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి రాజన్న చిత్రపటం, ప్రసాదం అందించారు. అనంతరం గౌడ హాస్టల్ ముఖ్య సలహాదరుగా ఎన్నికైన చిదుగు గోవర్ధన్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ పులి లక్ష్మీపతిగౌడ్‌లకు గోపా సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. గోపా జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, దూలం సంపత్‌గౌడ్, పొన్నం శ్రీకాంత్‌గౌడ్, దేవదాస్‌గౌడ్, కొండ రమేశ్‌గౌడ్, సంతోష్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.


మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు రాజన్న చిత్రపటం అందిస్తున్న గౌడ సంక్షేమ సంఘం, గోపా సభ్యులు

### యువతను ప్రోత్సహించేందుకు కోచింగ్ సెంటర్లు

- ఆధ్యాగోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మోహన్‌గోలి

వేములవాడ: యువత గ్రామాల్లో ఉండకుండా ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించేందుకు వేములవాడ ప్రాంతంలో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తానని ఆధ్యాగోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మోహన్‌గోలి పేర్కొన్నారు. ఇటీవల ఎస్సైగా ఎంపికైన వేములవాడకు చెందిన కొప్పుల స్వాతిని శనివారం అభినందించి సత్కరించారు. ఆమె తల్లిదండ్రులు లింగమూర్తి– లావణ్యను అభినందించారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్ అనుభవం ఉన్న 2 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. దేశంలోనే కాకుండా విదేశాలకు వెళ్లేలా తాను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉంటానని వెల్లడించారు. యువత నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా కోచింగ్‌ల వైపు దృష్టి సారించాలని సూచించారు. త్వరలోనే గ్రూప్–1, గ్రూప్–2, సివిల్ సర్వీసెస్‌లతోపాటు ఇతర ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తానని వివరించారు.


స్వాతిని సత్కరిస్తున్న డాక్టర్ మోహన్‌గోలి

# కమ్యూనిటీ కాంటాక్ట్‌తో నేరాల నిర్మూలన

- సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కమ్యూనిటీ కాంటాక్ట్‌తో నేరాలను నిర్మూలించవచ్చని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సారంపల్లి, ఇందిరమ్మకాలనీల్లో శనివారం కార్డెన్‌సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ చేపట్టారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి మాట్లాడుతూ నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తుందన్నారు. సరైన సర్టిఫికెట్లు లేని 28 బైక్‌లు, రెండు ఆటోలు, ఒక్క ట్రాలీఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. దాసరి లింగం ఇంట్లో నిర్వహిస్తున్న బెల్టుషాపు నుంచి రూ.12,100 విలువైన మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఐలు సదన్ కుమార్, శశిధర్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామస్తులకు సూచనలిస్తున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

### జెండాల తయారీలో స్కాం

సిరిసిల్లఅర్బన్: స్వాతంత్ర్య వజ్రోత్సవాలను పురస్కరించుకొని సిరిసిల్లకు వచ్చిన జాతీయ జెండాల తయారీలో భారీ స్కామ్ జరుగుతోందని సిరిసిల్ల క్లాత్ బ్యానర్ ప్రింటింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్ది చక్రపాణి ఆరోపించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. 1.50 కోట్ల జెండాల తయారీ కాంట్రాక్టు రాగా.. టెక్స్‌టైల్ పవర్ లూమ్ కార్పొరేషన్ చైర్మన్, టెస్కో జీఎంలు కలిసి ఇద్దరు వ్యక్తులకే ఆర్డర్లను ఇచ్చారన్నారు. కమీషన్ల కోసమే వారికి జెండాల తయారీ ఆర్డర్లను కేటాయించారని ఆరోపించారు. తమ అసోసియేషన్‌కు ఇవ్వాలని కోరినా తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అధ్యక్షుడు ఎక్కల్‌దేవి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వేణు, కోశాధికారి వెంకటేశ్, రాజు, అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.


మాట్లాడుతున్న చక్రపాణి

# జల్సాలకు అలవాటుపడి గంజాయి విక్రయాలు

- డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ: జల్సాలకు అలవాటుపడిన యువకుడు గంజాయి అమ్ముతూ మరింత మంది యువకులను పెడతోవ పట్టిస్తున్నాడని, ఇలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. కోనరావుపేట మండలం ధర్మారంకు చెందిన చెట్కూరి ఈశ్వర్ ప్రస్తుతం మారుపాక గ్రామంలో నివాసముంటున్నాడు. గంజాయి అమ్ముతూ వేములవాడ నందికమాన్ ప్రాంతంలో పట్టుబడినట్లు చెప్పారు. ఈశ్వర్ గంజాయికి బానిసై, ఇతర యువకులను సైతం ఈ ఉచ్చులోకి దింపుతున్నట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. యువతరం ఉన్నత చదువులు చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు, ప్రధానంగా యువకులు ఏం పని చేస్తున్నారో దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి వ్యక్తులెవరైనా కనిపిస్తే 100కు డయల్ చేసి వివరాలు వెల్లడించాలని కోరారు. వివరాలు వెల్లడించిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టౌన్ సీఐ కరుణాకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, టౌన్ సీఐ

# మహాసభను విజయవంతం చేయాలి

వేములవాడఅర్బన్: ఎస్సీల వర్గీకరణ సాధన, మహాజన రాజ్యాధికారం లక్ష్యంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఈ నెలాఖరులో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం వేములవాడ పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు గత 29 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమం ఫలితంగా ప్రస్తుతం లక్ష్యం చేరుటకు చివరి దశలో ఉన్నామన్నారు. మాదిగ జాతికి విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో జరుగుతున్న అన్యాయంపై దండోరా వేయడానికి మాదిగ విద్యార్థులంతా సిద్ధం కావాలని కోరారు. మాదిగల విశ్వరూప మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హేమంత్, దీపక్, శరత్, విష్ణువర్ధన్, శ్రీనివాస్, అశ్విన్, విజ్ఞాన్, గుండ థామస్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో నాయకులు

### ఒంటరితనంతో యువకుడి ఆత్మహత్యాయత్నం


బాధితుడు కనకరాజు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఒంటరితనం ఓ వైపు.. అప్పులబాధ మరోవైపు.. ఉపాధి కరువై మనోవేదనతో యువకుడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. వరుసకు సోదరుడు కాపాడడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలు. మండలంలోని చిప్పలపల్లికి చెందిన పిట్ల కనకరాజు(27) శుక్రవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరివేసుకున్నాడు. పొరుగున ఉన్న వరుసకు సోదరుడు పిట్ల మధు గమనించి కాపాడాడు. కనకరాజు తండ్రి చంద్రయ్య ఇరవై ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మృతిచెందాడు. ఉపాధి కోసం కనకరాజు సౌదీ అరేబియాకు వెళ్లి వచ్చాడు. అక్కడ సరైన పని లభించక అప్పులపాలయ్యాడు. ఈక్రమంలో పోతుగల్‌కు చెందిన శృతితో కనకరాజుకు పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు. కుటుంబ పోషణకు కనకరాజు మరింత అప్పు చేశాడు. కనకరాజు, శృతిల మధ్య గొడవలు రావడంతో భార్య ఏడాదిన్నర క్రితమే తల్లిగారింటికి వెళ్లిపోవడంతో కనకరాజు ఒంటరివాడయ్యాడు. ఇటు తల్లిదండ్రులు లేక, భార్య పిల్లలు దూరమై, అప్పుల బాధలు ఎక్కువ కావడంతో కనకరాజు ఆత్మహత్యకు యత్నించాడు. మాజీ సర్పంచ్ గాడిచర్ల దేవయ్య కౌన్సెలింగ్ ఇచ్చి.. కాపురం నిలబెట్టేందుకు భార్య తరపున పెద్ద మనుషులతో మాట్లాడుతానని భరోసానిచ్చారు.

# మత్స్యకారులకు సోలార్ ఎనర్జీ మరపడవలు

- పూర్తి సబ్సిడీతో మత్స్యకారులకు మరపడవలు
- మర పడవలపై మత్స్యకారులకు శిక్షణ
- తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్

బోయినపల్లి(చొప్పదండి): అధునాతన పద్ధతుల్లో చేపలు పట్టేలా మత్స్యకారులను ప్రోత్సహించేందుకు వారికి పూర్తి సబ్సిడీతో సోలార్ ఎనర్జీతో నడిచే మరపడవలు ప్రభుత్వం త్వరలో అందిస్తుందని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ పేర్కొన్నారు. బోయినపల్లి మండలం రత్నంపేట పరిసరాల్లోని వరదకాల్వ క్రాస్ రెగ్యులేటర్ వద్ద శనివారం చేపలు పట్టే పరిసరాలను పరిశీలించారు. పిట్టల రవీందర్ మాట్లాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి తెప్పలపై చేపలు పట్టే వారి కోసం సీఎం కేసీఆర్ సూచనలతో అధునాతన పద్ధతిలో చేపలు పట్టే విధానానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా చేపలు పట్టేవారికి పూర్తి సబ్సిడీతో మర పడవలు అందజేసి వాటితో చేపలు పట్టడంలో శిక్షణ ఇస్తామన్నారు. ఎస్సారెస్పీ నుంచి నాలుగు జిల్లాల మీదుగా 122 కిలోమీటర్ల మేర వరదకాల్వ విస్తరించిందని, ఇది మత్స్యకారులకు ఉపాధి ఇస్తుందన్నారు. ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పిట్టల రమేశ్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల సొసైటీ చైర్మన్లు కొలిపాక నర్సయ్య, మాల కనకయ్య, కరీంనగర్, రామడుగు ఏఎంసీల చైర్మన్లు రెడ్డి మధు, మామిడి తిరుపతి, నాయకులు పరివేణి పర్శరాములు, బొజ్జ లక్ష్మీరాజం, చొక్కాల రాము, రామానుజం, దండు చంద్రయ్య పాల్గొన్నారు.


వరదకాల్వ క్రాస్ రెగ్యులేటర్ వద్ద చేపలతో రవీందర్

### రాజన్న సేవలో ప్రముఖులు


ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దంపతులు


సీపీ సుబ్బారాయుడు దంపతులు

వేములవాడ: రాజన్నను శనివారం ప్రముఖులు దర్శించుకున్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్ దంపతులు, కరీంనగర్ పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు దంపతులు, మహారాష్ట్రలోని ఔరంగాబాద్ రిటైర్డ్ జడ్జి బీజీ పాటిల్ దంపతులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం నాగిరెడ్డి మంటపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వాదం కల్పించగా, పర్యవేక్షకులు తిరుపతిరావు స్వామివారి కండువా కప్పి సత్కరించారు.

### పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సిరిసిల్లఅర్బన్: రాజకీయాల లబ్ధి కోసం పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని, ఆ వ్యాఖ్యలు చేసిన ప్రజాప్రతినిధి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గంలో బీసీల పరంగా అత్యధిక ఓట్లు కలిగిన పద్మశాలీలు ఇప్పటి వరకు అందరినీ కలుపుకుంటూ పోయారని, కానీ మంత్రి కేటీఆర్ వద్ద ఓ ప్రజాపతినిధి 'పద్మశాలీల ఓట్లు వేస్తేనే గెలిచానా' అని మాట్లాడడం సరికాదన్నారు. ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని లేకుంటే అన్ని సామాజికవర్గాలను కలుపుకొని బీఆర్‌ఎస్‌ను గద్దె దించే వరకు పోరాడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సిరిపురం కైలాష్, ఎనగంటి నరేష్, గుడ్ల విష్ణు, శ్రీనివాస్, దూడం శివప్రసాద్, గాజుల సదానందం, మోర శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

### మహిళా డిక్లరేషన్‌తో అండగా ఉంటాం


మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మహిళ డిక్లరేషన్‌తో మహిళలను కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి, పదిర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను శనివారం ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రియాంకగాంధీతో మహిళా డిక్లరేషన్ చేయిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాయ మాటలు చెప్పి మళ్లీ అధికారంలోకి రావాలని తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ ఓటమి ఖాయమన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు అనవేని రవి, గంట బుచ్చగౌడ్, కొత్తపల్లి దేవయ్య, ఎండీ రఫీక్, చెన్నిబాబు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### చందాలతో అంత్యక్రియలు


పోశెట్టి (ఫైల్)

తంగళ్లపల్లి: మండలంలోని పద్మానగర్‌కు చెందిన చేరాల పోశెట్టి (60) శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడు అనాథ కాగా గ్రామంలో ఎవరు చనిపోయినా దహన సంస్కారాలు ముందుండి నడిపిస్తూ గ్రామస్తులు పెట్టింది తింటూ చేదోడు వాదోడుగా నిలుస్తున్నాడు. ఈక్రమంలో శనివారం పోశెట్టి మరణించడంతో గ్రామస్తులు చందాలు పోగుచేసి అతడి దహనసంస్కారాలు నిర్వహించారు.

### దళితబంధు అందించాలి


మాట్లాడుతున్న నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళితులు హక్కుల సాధనకు సంఘటితంగా ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులను నమ్మించి మోసం చేస్తోందన్నారు. దళితుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న రాష్ట్రంలోని దళితులందరికీ దళితబంధు అందించాలని డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి లక్ష్మణ్, సీపీఐ జిల్లాకమిటీ సభ్యులు కడారి రాములు, జిల్లా గౌరవ అధ్యక్షులు మంద సుదర్శన్ తదితరులు ఉన్నారు.

### బోరుబావి పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేశ్

బోయినపల్లి: మండలంలోని తడగొండ గౌడసంఘం భవన నిర్మాణానికి జెడ్పీ నిధులతో మంజూరైన బోరు బావి పనులను శనివారం సర్పంచు చిందం రమేశ్, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ ప్రారంభించారు. నిధులు మంజూరుచేసిన జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ కొండయ్యకు గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బత్తిని కమలాకర్, బండారి మహేందర్, చింతలకోటి మహేశ్ తదితరులు ఉన్నారు.

### నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై కేసులు

- బోయినపల్లిలో స్పెషల్ డ్రైవ్


వాహనాలు తనిఖీచేస్తున్న ఎస్సై మహేందర్

బోయినపల్లి: రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్ లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై మహేందర్ హెచ్చరించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో శనివారం మండలంలో పలుచోట్ల వాహనాల తనిఖీ స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్లలో నంబర్లు చెరిపేసి వాహనాలు నడుపుతున్నారని ఇలాచేయడం నేరమన్నారు. ఈ సందర్భంగా కొన్ని వాహనాలకు నంబర్లు రాయించారు. ట్రాఫిక్ ఈ చలాన్ తప్పించుకునేందుకు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలు చేపట్టరాదని పలువురు వాహనదారులకు అవగాహన సూచించారు. సరైన డాక్యుమెంట్లు లేని 10 వాహనాలకు జరిమానా వేసినట్లు ఎస్సై వివరించారు.

### పశువైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 187 గేదెలకు, 67ఎడ్లకు కలిపి మొత్తం 254 పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలువేశారు. పశుపోషణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పశువైద్యాధికారి అంజిరెడ్డి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

### సిరిసిల్లలో బీఎస్పీ ధర్నా



సిరిసిల్లటౌన్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గృహనిర్బంధం చేయడాన్ని నిరసిస్తూ పార్టీ నేతలు సిరిసిల్లలో శనివారం ధర్నా చేపట్టారు. బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకని భాను మాట్లాడుతూ లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్‌ను ప్రభావితం చేసే గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై ప్రభుత్వ విధానం సరికాదన్నారు. నిరుద్యోగుల డిమాండ్ మేరకు పరీక్షను వాయిదా వేయాలని కోరారు. నాయకులు మునీందర్, స్వామిగౌడ్, మహ్మద్ అబ్దుల్ నబీ, రాజబాబు, రమేశ్, అంజయ్య పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న మెష్‌డోర్స్

- అందమైన డిజైన్లు.. అందుబాటులో ధరలు
- దోమలకు చెక్.. గుమ్మాలకు అందాలు
- పల్లె పట్టణాల్లో పెరుగుతున్న వినియోగం





సండే స్పెషల్

బోయినపల్లి: వర్షాకాలం, చలికాంలో దోమలు, ఈగల బెడద తీవ్రంగా ఉంటోంది. దోమలతో కంటిమీద కునుకులేకుండా పోతోంది. ఈగలు తిండిపదార్థాలపై వాలుతూ చికాకు తెప్పిస్తున్నాయి. వీటితో పల్లె.. పట్టణ ప్రాంత ప్రజలు అనేక తంటాలు పడుతున్నారు. సాయంత్రమైతే చాలు ప్రతీ ఇంట్లో దోమలు, ఈగలతో వాటిని అంతం చేయడానికి బ్యాట్‌తో యుద్ధం చేస్తుంటారు. వరండాలో ఫ్యాన్ వేసుకుని కూర్చున్నా.. దోమలు కుడుతూ, ఈగలు వాలుతూ విసుగెత్తిస్తుంటాయి. వీటితో ఇల్లు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు అన్నిచోట్ల ఇబ్బందులు పడుతూనే ఉంటారు. ఈక్రమంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన మెష్‌డోర్స్ దోమలు, ఈగల బెడదకు చెక్‌పెడుతున్నాయి. సిరిసిల్ల, వేములవాడ వంటి పట్టణాలతో పాటు, బోయినపల్లి తదితర మండలకేంద్రాల్లో, మెష్‌డోర్స్ తయారు చేసే వారున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దోమల నివారణకు మెష్‌డోర్స్ వినియోగం బాగాపెరిగింది. ప్రతీ ఒక్కరూ అందమైన ఇంటిని నిర్మించుకోవడానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో.. అలాగే ఇంట్లోకి దోమలు రాకుండా చేసేందుకు అంతే శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈక్రమంలో రూ.లక్షలు వెచ్చించి టేకుకర్రతో అందమైన డిజైన్లతో చేసిన ఇంటి ప్రధాన ద్వారాలను సైతం దోమల నివారణకు బిగించిన మెష్‌డోర్లు కనిపించకుండా చేస్తున్నాయి.

### రెండురకాల మెష్ డోర్స్...

ఇంటి ప్రధానద్వారంతో పాటు, నలువైపులా అన్ని దర్వాజలకు, కిటికీలకు మెష్‌డోర్స్ బిగిస్తున్నారు. సింగిల్, డబుల్, రెండు రకాలుగా మెష్ డోర్స్ చేస్తున్నారు. అచ్చూ రెండు తలుపుల మాదిరిగా డబుల్ డోర్ ఏర్పాటుచేస్తున్నారు. కిటికీలకు సైతం సింగిల్, డబుల్ రెక్కలు ఉంటాయి. వీటిని తీసి పెట్టవచ్చు. ప్రధాన ద్వారానికి డ్రిల్లింగ్‌చేసి మెష్‌డోర్స్ అమర్చుతారు. డోర్‌తీసి వేస్తే అతుక్కునేందుకు డోర్‌కు సన్నటి అయస్కాంతం అమరుస్తారు. అలాగే స్లైడింగ్ డోర్లలో టూ ట్రాక్, త్రీ ట్రాక్ అనే రెండు రకాల డోర్స్ లభిస్తున్నాయి. చాలా మటుకు ఇళ్లలో ఇప్పుడు మెష్‌డోర్స్ వాడకం విపరీతమైంది.

### మెష్‌డోర్స్‌కు భలే గిరాకీ

మెష్‌డోర్ల వాడకం పెరగడంతో తయారీదారులు ప్రతీచోట అందుబాటులో ఉంటున్నారు. బోయినపల్లిలో సైతం షాపులు ఉన్నాయి.. మెష్ డోర్ల తయారీకి అల్యూమినీయం వాడతారు. దర్వాజ ఫ్రేమ్, కిటీకీల ఫ్రేమ్ ముందు అతికినట్లుగా మెష్‌డోర్స్ అమర్చడం వారి ప్రత్యేకత. సింగిల్‌డోర్‌కు అమర్చే మెష్‌డోర్‌కు రూ.4,200, డబుల్ రెక్కలతో చేసే డోర్స్‌కు రూ. 5,200, కిటీకీలకు రూ.1200, స్లైడింగ్ టూ ట్రాక్ రూ.260, త్రీ ట్రాక్‌కు రూ.360 ఎస్ఎఫ్‌టీ చొప్పున తీసుకుంటారు. రూ.1500 వరకు ఒక రెక్క చేస్తారు.

### దోమల బెడద తగ్గింది



సాయంత్రమైతే చాలు దోమలతో చాలా ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు కురిసిన తర్వాత ఈగలు, పురుగులు, ఉసీళ్లు సైతం వస్తున్నాయి. దీంతో చాలా సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల ఇంట్లో ముందు, వెనుక డోర్స్‌కు, కిటికీలకు మెష్‌డోర్స్ ఏర్పాటు చేయించాను. దీంతో దోమల బెడద తగ్గింది.

– ఎంపీ. రమణయ్య, బోయినపల్లి

### మెష్‌డోర్స్ వినియోగం పెరిగింది



నూతనంగా నిర్మించే ఇళ్లకు మెష్‌డోర్స్ తప్పనిసరిగా చేయిస్తున్నారు. అల్యూమినీయం డోర్స్ అందంగా ఉండడంతో పాటు, దోమలు, పురుగుల నుంచి రక్షణగా ఉంటుంది. ఏళ్లు గడిచినా చిలుము, పుచ్చురాక పోవడంతో మన్నికగా ఉంటుంది. మెష్‌డోర్స్ తయారీకి ఇక్కడ మంచి ఆదరణ ఉంది.

– పొన్నం రాజు, మెష్ డోర్స్ షాపు, యజమాని బోయినపల్లి

## మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ బూర వజ్రమ్మ

వేములవాడఅర్బన్: ఎంపీడీవోకార్యాలయంలో ఎంపీపీ బూర వజ్రమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా ఎంఈవో భూక్య బన్నాజీ పాఠశాల వివరాలు వెల్లడించారు. దీంతో రుద్రవరం సర్పంచ్ ఊరడి రాంరెడ్డి మాట్లాడుతూ.. రుద్రవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలుగు టీచర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా టీచర్‌ను నియమించలేదని మండిపడ్డారు. కొడుముంజ సర్పంచ్ కదిరె రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్అండ్ఆర్ కాలనీలో ఆరేళ్లక్రితం ప్రభుత్వ పాఠశాలను నిర్మించి ఇప్పటివరకు ప్రారంభించలేదని దీంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కొడుముంజ గ్రామశివారులో లక్షలు వెచ్చించి శ్మశానవాటికనిర్మించినా దారిలేక నిరుపయోగంగా మారిందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య సర్వసభ్య సమావేశానికి హాజరు కావడంలేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. నాంపల్లిలో ఒకటే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండడంతో గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతోందని మరో సబ్‌స్టేషన్ ఏర్పాటుచేస్తే విద్యుత్ సమస్య తొలగిపోతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీడీవో శ్రీధర్, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, ఎంపీటీసీలు బుర్ర లహరిక, వనపర్తి దేవరాజం సర్పంచ్‌లు ఊరడి రాంరెడ్డి, కదిరె రాజ్‌కుమార్, వెంకటరమణారావు, అధికారులు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం


ఉత్తర్వులు అందిస్తున్న కళ-చక్రపాణి దంపతులు

సిరిసిల్లటౌన్: ప్రజాసంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. పట్టణంలోని 17, 18, 19, 27 వార్డుల్లో బూత్‌కమిటీలను నియమించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే ప్రజల మద్దతు ఉంటుందని తెలిపారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**పరామర్శ**

మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తౌటు కనుకయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాసర్ల మల్లేశంను శనివారం చైర్‌పర్సన్ జిందం కళ పరామర్శించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షు డు జిందం చక్రపాణితో కలిసి వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షు డు ఎండీ.సత్తార్, కార్యదర్శి మ్యాన రవి, అవార్డు అధ్యక్షుడు కాసర్ల మహేందర్ ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

### బీమా పరిహారం అందజేత

కోనరావుపేట: మండలం జైసేవాలాల్ భుక్యారెడ్డి తండాకు చెందిన భుక్యా కిషోర్ ప్రమాదవశాత్తు మృతిచెందగా వారి కుటుంబానికి రూ. 2లక్షల బీమా పరిహారాన్ని బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. భుక్యా కిషోర్ బీఆర్‌ఎస్‌లో క్రియాశీలక సభ్యత్వాన్ని కలిగిఉన్నారు. అతని భార్య విజయకు పరిహారం చెక్కును అందజేశారు.

**పార్టీ కార్యకర్తలపై కేసు**

ముస్తాబాద్: మండలంలో మూడు రోజుల క్రితం కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేసిన ధర్నా, రాస్తారోకో ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. రాజీవ్‌చౌక్‌లో కాంగ్రెస్ నాయకులు బీసీబంధు కోసం రాస్తారోకో చేయగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని బీజేపీ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ రెండు ఘటనలపై ఆరుగురు కాంగ్రెస్ నాయకులు, ఐదుగురు బీజేపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదుచేశారు.

**స్పాట్ అడ్మిషన్లు**

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఖాళీగా సీట్లను భర్తీచేస్తున్నట్లు ప్రిన్సిపాల్ దర్శనాల పద్మ తెలిపారు. బైపీసీలో బీసీ 1, ఓసీ1 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్‌సర్టిఫికెట్స్‌తో సోమవారం కళాశాలకు రావాలని కోరారు. 2022–23లో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని వార్షిక ఆదాయం పట్టణ వాసులు రూ.2 లక్షలు, గ్రామాల్లో రూ.1.50 లక్షల లోపు ఉండాలని సూచించారు.

**నూతన నియామకం**

ఇల్లంతకుంట: మండలంలోని సోమారంపేటకు చెందిన ఐరెడ్డి సురేందర్‌రెడ్డిని కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడుగా నియమిస్తు జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

**పోలీసుల ఆరా**

ముస్తాబాద్: మండలంలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మండలంలోని రైస్‌మిల్లులు, ఇటుకబట్టి పరిశ్రమలతోపాటు భవన నిర్మాణ పనుల్లో ఎంతమంది కార్మికులు ఉన్నారో ఆరా తీస్తున్నారు. జార్ఖండ్, బీహార్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేసే వారి చిరునామాలను తీసుకుంటున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్లు, వారు ఎవరి వద్దపనిచేస్తున్నారో తెలుసుకుంటున్నామన్నారు.

**ఇంటింటా సర్వే ప్రారంభం**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వరతండాలో గృహలక్ష్మీ దరఖాస్తులపై శనివారం ఇంటింటా సర్వే చేపట్టారు. సర్పంచ్ అజ్మీర రజిత-తిరుపతినాయక్, ఎంపీడీవో కార్యాలయం అధికారి రాజునాయక్, ఏఈసంతోష్, సెక్రటరీ సిరియా ఉన్నారు.

**సర్పంచ్ వెంకట్‌రెడ్డికి సన్మానం**

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఇటీవల ఉత్తమ సామాజిక సేవాకార్యకర్త అవార్డు అందుకోగా.. అపూర్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు.

## బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

- చందుర్తి మండలంలో రూ. 380 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం
- గ్రామాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి
- సీఎం కేసీఆర్ కార్మికుల పక్షపాతి
- దళితబంధు, బీసీ బంధును పారదర్శకంగా అమలు
- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

చందుర్తి: ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే మరోమారు ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. చందుర్తి మండలం సనుగుల గోవిందరాజుల స్వామి సన్నిధిలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ జిల్లాఅధ్యక్షుడు తోట ఆగయ్య హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చందుర్తి మండలంలో రూ. 380 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చేసిన అభివృద్ధి పనులే తమను ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయన్న ధీమాను వ్యక్తంచేశారు. నిరుపేదలైన లబ్ధిదారులకు బీసీబంధు, దళితబంధు, గృహలక్ష్మీ పథకాలులను పారదర్శకంగా అందిస్తామన్నారు. పార్టీని గ్రామాల్లో మరింతగా బలోపేతం చేసేందుకు బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను ప్రతీ కార్యకర్త గడప గడపకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో చందుర్తి సెస్‌డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, రుద్రంగి మార్కెట్‌కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, సర్పంచ్‌లు లింగంపల్లి కురుణాకర్, లింగంపల్లి సత్తయ్య, దుమ్ము అంజయ్య, చిలుక అంజిబాబు, 600 మంది పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### ఎస్సైలకు సన్మానం


సన్మానిస్తున్న సీఐ, ఎస్సై శశిధర్‌రెడ్డి, రమాకాంత్

గంభీరావుపేట: ఇటీవల ఎస్సైలుగా ఎంపికైన పిట్ల దీపక్, అందె సతీశ్‌ను ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ శనివారం సన్మానించారు. యువత మంచి లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరాలని ఆకాంక్షించారు.

### గాంధీ చిత్రం ప్రదర్శన

సిరిసిల్లకల్చరల్: స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు నేపథ్యంలో ఈనెల 14 నుంచి పది రోజులపాటు గాంధీ చలన చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని సినిమా థియేటర్లలో ఉచిత ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, సాధారణ ప్రజలు కూడా వీక్షించే అవకాశం కల్పించినట్లు వివరించారు. ఈనెల 14న ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు, 15, 20 తేదీల్లో మినహాయించి 24వ తేదీ వరకు నిత్యం సినిమా ప్రదర్శన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని వివరించారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేసినట్లు సర్పంచ్ కాశోల్ల పద్మ తెలిపారు. మంత్రి కేటీఆర్ సహకారంతో బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి అందించామన్నారు నాయకులు బాలకృష్ణ, దేవదాస్, దుర్గాప్రసాద్ ప్రభుదాస్, రంజిత్, బాలయ్య, భూమయ్య, రాజనర్సు, సాయి పాల్గొన్నారు.

### గౌడహాస్టల్ సలహాదారులుగా చిదుగు

ఎల్లారెడ్డిపేట: గౌడహాస్టల్ సలహాదారులు జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ ఎన్నికయ్యారు.హైదరాబాద్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈమేరకు ఎన్నుకున్నారు. కో–ఆప్షన్‌సభ్యులుగా పులి లక్ష్మీపతిగౌడ్ ఎన్నికయ్యారు. వీరిని శాలువాతో సన్మానించారు. సిరిసిల్ల పీఏసీఎస్ చైర్మన్ దేవదాసుగౌడ్, బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, కొత్త సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఓమన్‌లో గద్దర్‌కు నివాళి


ఓమన్‌లో గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న ప్రవాసీలు

సిరిసిల్లటౌన్: ఓమన్ దేశంలో ప్రవాస భారతీయులు గద్దర్ సంతాపసభ నిర్వహించారు. ఓమన్‌లోని మిస్సా బల్దియా క్యాంపులో బీఆర్. అంబేద్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో దివంగత ప్రజాగాయకుడు గుమ్మడి విఠల్‌రావు(గద్దర్) సేవలను సంస్మరించుకున్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని వక్తలు పేర్కొన్నారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గాలిగాని రాజు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, అశోక్, రంజిత్, స్వామి, గంగమల్లు, శ్రీనివాస్, వేణు, జుబేర్‌పాషా, సాయిగౌడ్, సుభాష్, నవీన్, వినోద్, పోషన్న పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి గాయాలు

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన బొమ్మగోని చంద్రశేఖర్‌గౌడ్‌కు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఉదయం గ్రామంలో తాటిచెట్టు ఎక్కుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే తోటి గౌడ కులస్తులు, కుటుంబసభ్యులు అతడిని వేములవాడకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ పండుగ తిరుపతి, గౌడకులస్తులు ఆయనను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు తెలిపారు.

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన గంట అంజాగౌడ్ అనే గీతకార్మికుడు ఈతచెట్టుపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. అంజాగౌడ్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలందిస్తున్నారు. పలువురు నాయకులు అంజాగౌడ్‌ను పరామర్శించారు.

### కమ్యూనిటీహాల్స్ నిర్మాణాలకు పెద్దపీట


మంజూరుపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: గ్రామాల్లో ప్రతీ సామాజికవర్గానికి చెందిన కమ్యూనిటీహాల్స్ నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం తడగొండకు చెందిన గౌడ, మున్నూరుకాపు సంఘాలు, బీరప్ప ఆలయానికి సీసీ రోడ్డు మంజూరుకు రూ.4 లక్షల చొప్పున ప్రొసీడింగ్స్ కాపీలు అందించారు. సర్పంచ్ చిందం రమేశ్, నాయకులు దయ్యాల కొమురయ్య, బుర్ర రాజు, బత్తిని కమలాకర్, రేండ్ల గంగరాజు, చేపూరి మహిపాల్, చింతలకోటి మహేశ్, ముదాం కమలాకర్ తదితరులు ఉన్నారు.

### హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్లరవిగౌడ్ అన్నారు. శనివారం బీసీ భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. హాస్టళ్లకు పక్కా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్నిహాస్టళ్లలో కనీస వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థిసంఘం ఆధ్వర్యంలో త్వరలో సందర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేనియెడల పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీసీవిద్యార్థిసంఘం నాయకులు రాకేశ్,రమేశ్, నరేశ్, సునీల్, వంశీ, నరేందర్, ఉన్నారు.

### ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్లటౌన్: ఆశావర్కర్ల సమస్యలను సర్కారు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల నెహ్రూనగర్‌లోని ఆర్‌ఎంపీ భవనంలో నిర్వహించిన పీహెచ్‌సీల లీడర్ల సమావేశంలో మాట్లాడారు. ఆశావర్కర్లకు కనీస వేతనాలు అమలుచేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేపడుతున్నామన్నారు. సీఐటీయూ ఆశావర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి గుమ్మడి జయశీల, ఉపాధ్యక్షురాలు చిర్రం గాయత్రీ, ఓరగంటి రాణి, సహాయకార్యదర్శులు ఎర్ర చంద్రకళ, బిజిగ రుచిత, కోశాధికారి కట్కూరి కస్తూరి, కమిటీ సభ్యులు లావణ్య, రుక్మిణి, తార,రేణుక, వరలక్ష్మి, లావణ్య, చంద్రకళలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు మూశం రమేశ్, మోర అజయ్, మిట్టపల్లి రాజమల్లు పాల్గొన్నారు.